క్లుప్తంగా

అర్హులందరికీ పక్కా ఇళ్లు



సదుం: చీకలచేనులో పర్యటిస్తున్న అధికారులు, నాయకులు

సదుం: అర్హులైన నిరుపేదలందరికీ పక్కా గృహాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం అర్హులను గుర్తించేందుకు మొరవపల్లె పంచాయతీ చీకలచేను, చెరువుముందరపల్లె, గొల్లపల్లె, గాదేవారిపల్లెలో పర్యటించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అరుణ్, పంచాయతీ కార్యదర్శి లోకేష్, సర్పంచ్ జగన్నాథం, రెడ్డెప్పరెడ్డి, భగీరథరెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా సొమ్ము అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

గంగవరం: మండలంలోని సాయినగర్‌కు చెందిన సీతారాం(41) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి వైఎస్సార్ బీమా వర్తించింది. ఈ క్రమంలో తక్షణ సాయంగా రూ.10 వేలను శుక్రవారం మృతుడు సీతారాం కుటుంబ సభ్యులకు సర్పంచ్ చంద్రమ్మ, సచివాలయ సిబ్బంది అందజేశారు.

వంట పాత్రల పంపిణీ



వంటసామగ్రి అందజేస్తున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, కన్వీనర్ నాదమునిరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4.37 లక్షల వంట సామగ్రిని శుక్రవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అందజేశారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వండడానికి నాణ్యమైన పాత్రలు అందజేసినట్టు తెలిపారు. ఎంఈవో సిద్ధరామయ్య, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాతపేటలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 175 పశువులకు పిడుదులు, నట్టల నివారణ మందులు వేశారు. అలాగే యదకు రాని పశువులకు చికిత్స చేశారు. పశువైద్యాధికారి మునిచంద్ర, పశువైద్య అసిస్టెంట్ ఖాదర్‌వలి, స్థానిక సర్పంచ్ నటరాజ పాల్గొన్నారు.

బోయకొండలో శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు



రాహుకాల అభిషేక పూజలకు తరలివచ్చిన భక్తజనం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు చేశారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేపాకు, పూలతోరణాలతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటల నుంచి 12 మధ్యలో రాహుకాల అభిషేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం వద్ద రద్దీ నెలకొంది. అధికారులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎస్‌ఐ రవికుమార్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

సచివాలయాల కన్వీనర్‌గా రాజశేఖర్‌రెడ్డి



రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న భాస్కర్‌రెడ్డి, నాగరాజారెడ్డి, చెంగారెడ్డి

పుంగనూరు: పుంగనూరు మండల సచివాలయాల కన్వీనర్‌గా రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను శుక్రవారం సాయంత్రం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి సన్మానించి నియామక పత్రం అందజేశారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన మంత్రి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

- పుంగనూరులో స్టేడియం ఏర్పాటుకు కృషి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- హోరా హోరీగా సాగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు
- తరలివచ్చిన 700 మంది క్రీడాకారులు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న విజయవాణి విద్యాసంస్థల నిర్వాహకులు





పరుగు పోటీలను ప్రారంభిస్తున్న నాయుని చంద్రశేఖరమూర్తి, ర్యాలీ చేస్తున్న క్రీడాకారులు

చౌడేపల్లె: క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందని, చిన్నతనం నుంచే క్రీడలపై దృష్టి సారించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. విజయవాణి రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం విజయవాణి సంస్థల కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖరమూర్తి, గురుశేఖరమూర్తి, సుధాకరమూర్తి, నాయుని మహేష్ సహకారంతో ఏర్పాటుచేసిన నియోజకవర్గ గ్రిగ్ మెమోరియల్ జోనల్ స్థాయి క్రీడా పోటీలను మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుంగనూరులో స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. పోటీలకు పుంగనూరు, పెద్దపంజాణి, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల నుంచి 700 మంది క్రీడాకారులు తరలిరావడం అభినందనీయమన్నారు. ప్రతియేటా క్రీడా పోటీలు నిర్వహించడానికి సహకరించాలని విజయవాణి విద్యాసంస్థల నిర్వాహకులను కోరారు.

జాతీయ, క్రీడా జెండాల ఆవిష్కరణ

జోనల్ క్రీడల సందర్భంగా క్రీడా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జాతీయ జెండాను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. అలాగే జోనల్ స్థాయి క్రీడా పోటీల జెండాను ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. మంత్రికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హోరాహోరీగా సాగిన పోటీలు

పుంగనూరు జోనల్ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఏడు మండలాల నుంచి 700 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యా రు. సీనియర్ బాలురు, సీనియర్ బాలికలు, జూనియర్ బాలికలు, జూనియర్ బాలురకు పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్, హై జంప్, డిస్క్‌త్రో, జావిలింగ్ త్రో పోటీలు నిర్వహించారు. విజేతలకు విజయవాణి విద్యా సంస్థల నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజయవాణి విద్యా సంస్థల కర స్పాండెంట్ నాయుని చంద్రశేఖరమూర్తి స్టేడియం ఏర్పాటు చేయాలని మంత్రిని అభ్యర్థించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి స్థల సేకరణ చేసి స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంజిబాబు, సచివాలయ కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ





సదుం: నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, బాధిత కుటుంబ సభ్యులతో మంత్రి పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని జాంద్రపేటకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం సురేంద్ర ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం పరామర్శించారు. సురేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ యల్లప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, నాయకులు మల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఖజాపీర్, ఖమ్రుద్దీన్, ఇమ్రాన్, ఇర్ఫాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే ఆదర్శంగా పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న చేదోడు పథకం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకు దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా మంచి జరిగి ఉంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. అనంతరం జగనన్న చేదోడు పథకం లబ్ధిపొందిన వారు సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ శరవణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ బుక్‌లెట్‌ను అందచేస్తున్న ఎమ్మెల్సీ భరత్



రోగులకు సురక్ష కిట్లు అందజేస్తున్న నాయకులు, అధికారులు

రామకుప్పం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ కోరారు. మండలంలోని మణీంద్రం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్నారని చెప్పారు. వైద్య శిబిరంలో 495 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉషారాణి, ఎంపీడీవో శివశంకర్, ఈవోఆర్డీ రాధాకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు లోకేష్, దీప, అల్తాఫ్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నేత చంద్రమోహన్ రెడ్డి, శివప్రకాష్, గోపి, గంగయ్య, శివ పాల్గొన్నారు.

318 మందికి వైద్యం

శాంతిపురం: కొలమడుగు పంచాయతీ రెడ్లపల్లిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 318 మందికి వైద్య సేవలు అందించినట్టు డాక్టర్లు ప్రసాద్, ఉషారాణి, దివ్య, కావ్య, మణిశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాసులు, ఎంపీడీవో హేమమాలిని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, కో ఆప్షన్ సభ్యుడు నిసార్, స్థానిక సర్పంచ్ మంజునాథ్, ఎంపీటీసీ దేవేంద్రప్ప పాల్గొన్నారు.

చౌడేపల్లెలో 245 మందికి వైద్య పరీక్షలు

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 245 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు డాక్టర్లు అనూరాధ, మనీష్, పూజ, ప్రవీణ్ తెలిపారు. జగనన్న కంటి వెలుగు ద్వారా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతమ్మ, ఎంపీడీవో సుధాకర్ పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

కుప్పం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బెంగళూరు నగరానికి చెందిన వైదేహి ఆస్పత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని సాయిమాతా సేవా ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారంలో చొరవ తీసుకోవాలి

రొంపిచెర్ల: భూ సమస్యల పరిష్కారంలో వీఆర్వోలు, సర్వేయర్లు చొరవ తీసుకోవాలని తహసీల్దార్ అమరనాథ్ ఆదేశించారు. ఆయన శుక్రవారం రెవెన్యూ ఇబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ భూ రికార్డుల నమోదులో తప్పులు లేకుండా చూడాలన్నారు. భూ సమస్యపై రైతులు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కారం చూపాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా కుల, నివాస, ఆదాయం తదితర సర్టిఫికెట్లను త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీటీలు లోకేష్, వెంకటరమణా రెడ్డి, ఆర్ఐ అబ్దుల్‌ఖాదర్, మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్వోలు పల్లవి, మహేష్, ప్రసాద్, యల్లప్ప, శ్రీనివాసులు, సురేంద్ర పాల్గొన్నారు.

నేడు వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన

పెద్దపంజాణి: వాల్మీకి జయంతి సందర్భంగా పెద్దపంజాణిలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. ఇందులో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన





విద్యార్థులకు పోలీసుల సేవలను వివరిస్తున్న చౌడేపల్లి, సోమల ఎస్‌ఐలు రవికుమార్, వెంకట నరసింహులు

చౌడేపల్లె: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌడేపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పోలీసుల విధులు, చట్టాలపై ఎస్‌ఐ రవికుమార్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు పోలీసులతో స్నేహభావంతో ఉంటూ సహకరించాలని కోరారు. బాల్య వివాహాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, దిశా యాప్ వినియోగం గురించి వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

సోమల: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమల హైస్కూల్ విద్యార్థులకు సైబర్ క్రైం, పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలపై అవగాహన కల్పించారు. సమస్యలు వచ్చినప్పుడు పోలీసులు అవలంబించే విధానాలను వివరించారు. ఏఎస్‌ఐ దామోదరం, హెడ్ కానిస్టేబుల్ మునిప్రసాద్, ఉపాధ్యాయులు జ్యోతీశ్వరుడు పాల్గొన్నారు.

జోనల్ క్రీడల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థులతో పీడీ కరుణానిధి

సోమల: పుంగనూరు నియోజకవర్గ జోనల్ క్రీడల్లో సోమల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని స్వాతి ఉత్తమ ప్రతిభ చూపి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నట్టు హెచ్‌ఎం నాగరాజ, ఫిజికల్ డైరెక్టర్ కరుణానిధి తెలిపారు. చౌడేపల్లె మండలం విజయవాణీ పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించారని తెలిపారు. ఇందులో స్వాతి సీనియర్ బాలికల విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు సోమల విద్యార్థులు





రెడ్డి కిరణ్మయి, సాయి మదన్

సోమల: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు సోమల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం తుంగా నాగరాజ శుక్రవారం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి టోర్నమెంట్, అండర్ 14 విభాగం కింద ఎంపికల్లో తమ విద్యార్థులు రెడ్డి కిరణ్మయి, సాయి మదన్ ప్రతిభ చూపి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ కరుణానిధి తెలిపారు. వీరు నవంబర్ 4, 5, 6వ తేదీల్లో నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పాలస్తీనా మృతులకు ముస్లింల నివాళి

పుంగనూరు: పాలస్తీనా యుద్ధంలో మృతి చెందిన వారికి పుంగనూరు అంజుమన్ కమిటీ నివాళులర్పించింది. కమిటీ అధ్యక్షుడు ఎంఎస్.సలీం, ఉపాధ్యక్షుడు జాఫర్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ము ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ముతవల్లీలు, మతగురువులు, ముస్లింలు సమావేశమయ్యారు. పాలస్తీనా, ఇజ్రాయెల్ దేశాలు యుద్ధాన్ని ఆపేయాలని, ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ సందేశం పంపారు. ఈ సమావేశంలో కార్యదర్శి ఇబ్రహీం, హజ్ కమిటీ మెంబర్ ఖాదర్, అజీజ్‌సాబ్, ఇస్మాయిల్, జబీవుల్లా, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళదాం.. పథకాలను వివరిద్దాం






మాట్లాడుతున్న జింకా వెంకటాచలపతి, గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

పుంగనూరు: రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి పిలుపునిచ్చారు. పుంగనూరులో శుక్రవారం సాయంత్రం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మా నమ్మకం నువ్వే జగన్.. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కరపత్రాలు విడుదల చేశారు. జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పరిపాలన సాగిస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎందుకు చేసుకోవాలి అన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతిఇంటికీ వెళ్లి బుక్‌లెట్లు, ప్రశ్నావళి అందజేసి వారి అభిప్రాయాలు సేకరించాలన్నారు. సమావేశంలో బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహులు, నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, రమణ, సుబ్రమణ్యం, గురివిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధిని వివరిద్దామని జెడ్పీటీసీ దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి పిలుపునిచ్చారు. వారు శుక్రవారం చౌడేపల్లె, పెద్దకొండామర్రి, వెంగళపల్లె, దిగువపల్లె, కాగతి, కాటిపేరి గ్రామపంచాయతీలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నేతలతో సమావేశమై ఏపీ జగన్ ఎందుకు కావాలి అన్న కార్యక్రమంపై చర్చించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చేపట్టాల్సిన కార్యాచరణపై శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ పభుత్వానికి ఉన్న తేడాను వివరించి మళ్లీ జగనన్నకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తోక పార్టీలు పుట్టుకొస్తున్నాయని తెలిపారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేలా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సూచించారు. అనంతరం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంజిబాబు, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రుక్మిణమ్మ, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్, సర్పంచ్‌లు వరుణ్‌భరత్, జయసుధమ్మ, నాగరత్న, సోని, సరిత, షంషీర్, ఉపసర్పంచ్ అల్తాఫ్, బోయకొండ గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యుడు పవన్, ఎంపీటీసీలు రుపారేఖా, శ్రీరాములు, నేతలు ఠాణాధార్ నాగరాజ, సద్దాం, హరీష్, మంజునాథం బాబు, అల్లాబక్షు పాల్గొన్నారు.

పంటల నమోదుపై అభ్యంతరాల స్వీకరణ



రొంపిచెర్ల ఆర్బీకేలో పంటల నమోదు వివరాలను చూసుకుంటున్న రైతులు

రొంపిచెర్ల: వ్యవసాయ పంటల నమోదుపై అభ్యంతరాలను ఆదివారం వరకు స్వీకరించనున్నట్టు మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. రొంపిచెర్ల రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతుల పంటల వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ పంటల నమోదులో తేడాలు ఉంటే ఆర్బీకే ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్‌కు ఫిర్యాదు చేస్తే సరి చేస్తామన్నారు. ఆర్బీకే పరిధిలో 299 మంది రైతులు 922 ఎకరాల్లో పంటలు సాగు చేశారని చెప్పారు. వారికి పంటల సాగు కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్, రైతులు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలో 2023లో ఈ-క్రాప్ నమోదుపై వెంకట దాసరపల్లె ఆర్బీకేలో శుక్రవారం వివరాలు ప్రదర్శించినట్టు మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ ఏడాది 930 హెక్టార్లలో సాగు చేసిన పంటలను నమోదు చేయించినట్టు తెలిపారు. వీటిపై అభ్యంతరాలను ఆదివారం లోపు ఆర్బీకేలో తెలపాలన్నారు. అలాగే వర్ష ప్రాంత అభివృద్ధి పథకం కింద మతుకువారిపల్లె, వెంకటదాసరపల్లె పంచాయతీలు ఎంపికైనట్టు తెలిపారు. వారికి 50 శాతం సబ్సిడీతో వేరుశనగ పంట నూర్పిడి యంత్రాలు, వేరుశనగ నూనె తీసే పరికరాలు, మినీదాల్‌మిల్, మినీ పిండిమిల్లు, ఆయిల్ ఎక్స్‌పెల్లర్లు అందజేస్తామన్నా రు. దామోదర్, ద్వారక, దామోదర్‌రెడ్డి, ఆర్‌బీకె ఇన్‌చార్జి రెడ్డిమంజుల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి వితరణ



వస్తు సామాగ్రిని వితరణ చేస్తున్న దాత సీతారామయ్య

గంగవరం: పలమనేరు మండలం, అర్బన్ సెక్టార్‌లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు శుక్రవారం దాతలు శ్రీపురం సీతారామయ్య సహకారంతో ఫ్యాన్లు, స్టౌలు, దేశ నాయకుల ఫొటోలు వితరణ చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని, సూపర్‌వైజర్లు, పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుడి మృతి

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లుకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు గండికోట సుధాకర్(72) శుక్రవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న విశ్రాంత ఉద్యోగులు, శిష్యులు వారి ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.